ధాన్యం కొనుగోళ్లపై ఎట్టకేలకు కదలిక

సమీక్షలో మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా స్పెషల్ ఆఫీసర్ ఆర్వీ కర్ణన్

- చర్చకు దారితీసిన 'నమస్తే తెలంగాణ' కథనం
- రంగంలోకి అధికార యంత్రాంగం
- కరీంనగర్‌కు జిల్లా స్పెషల్ ఆఫీసర్ ఆర్వీ కర్ణన్
- కొత్తపల్లి, బొమ్మకల్, గర్రెపల్లి కేంద్రాల్లో ధాన్యం పరిశీలన
- నిర్వాహకులు, రైతుల నుంచి వివరాల సేకరణ
- కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా అధికారులతో సమీక్ష
- కొనుగోళ్లు వేగవంతం చేయాలని ఆదేశం • ఈ నెలాఖరు వరకు వందశాతం పూర్తి చేయాలని స్పష్టం • తడిసిన ధాన్యం కొని రైతులకు అండగా ఉండాలని సూచన

నమస్తే ఎఫెక్ట్

ధాన్యం కొనుగోళ్లపై ఎట్టకేలకు అధికార యంత్రాంగం కదిలింది. కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరుగుతున్న నేపథ్యంలో రైతుల బాధను కళ్లకుగడుతూ 'ఆగమవుతున్న రైతులు.. పత్తాలేని మంత్రులు' శీర్షికన ఆదివారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనం తీవ్ర చర్చకు దారితీసింది. దీంతో యంత్రాంగం రంగంలోకి దిగింది. ఉమ్మడి జిల్లాకు స్పెషల్ ఆఫీసర్ ఆర్వీ కర్ణన్ సోమవారం రావడమే కాదు.. కొత్తపల్లి, బొమ్మకల్, గర్రెపల్లి కేంద్రాల్లో ధాన్యాన్ని పరిశీలించారు. ఆ తర్వాత కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా అధికారులతో సమీక్షించి, ధాన్యం కొనుగోళ్లను మరింత వేగవంతం చేయాలని, ఈ నెలాఖరు వరకు వందశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేసి రైతన్నకు అండగా ఉండాలని, ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తేవాలని సూచించారు.

బొమ్మకల్‌లో ధాన్యం పరిశీలిస్తున్న ఆర్వీ కర్ణన్

కరీంనగర్, మే 20 (నమస్తే తెలంగాణ) : ఓవైపు అకాల వర్షాలు పడుతున్నాయి. మరో వైపు ధాన్యం కొనుగోళ్లు మంద కొడిగా నడుస్తున్నాయి. దీంతో కొనుగోలు కేంద్రాల్లో ఎక్కడ చూసినా ధాన్యపు రాశులు కుప్పలు తెప్పలుగా కనిపిస్తున్నాయి. ఇంకోవైపు వర్షాలుంటాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో మబ్బులు కమ్ముకున్నా.. చిన్న చినుకు పడినా చాలు రైతుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. వానల కారణంగా ధాన్యం తడిసి తేమ శాతం పెరుగుతుండగా, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా, తాము పండించిన ధాన్యాన్ని కొనాలంటూ నేరుగా ఆందోళనలకు దిగుతున్నారు. అయినా, పట్టించుకునే వారు లేక.. ఉమ్మడి జిల్లా మంత్రులు కనీసం కన్నెత్తి చూడక మరింత కుంగిపోయారు. ఈ నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్ల వేళ రైతులు పడుతున్న బాధలను,, క్షేత్ర స్థాయిలో జరుగుతున్న పరిణామాలను పరిశీలించిన 'నమస్తే తెలంగాణ' ఆదివారం (ఈ నెల 19న) 'ఆగమవుతున్న రైతులు.. పత్తాలేని మంత్రులు' శీర్షికన సమగ్ర కథనాన్ని ప్రచురించింది. దాంతో ఈ కథనంపై ఉమ్మడి జిల్లా స్పెషల్ ఆఫీసర్ ఆర్వీ కర్ణన్ ప్రత్యేకంగా చర్చించినట్లు స్పష్టమవుతున్నది.

రంగంలోకి ఆర్వీ కర్ణన్

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరుగుతున్న తీరుపై ప్రచురితమైన 'నమస్తే కథనం' రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారితీసింది. సర్కారు ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం కదిలింది. ఆదివారం సెలవు కావడంతో సోమవారం రంగంలోకి దిగింది. ఉమ్మడి జిల్లాకు స్పెషల్ ఆఫీసర్‌గా ఉన్న రాష్ట్ర కుటుంబ, ఆరోగ్య సంక్షేమ శాఖ డైరెక్టర్ ఆర్వీ కర్ణన్ కరీంనగర్ జిల్లాకు వచ్చారు. సాయంత్రం తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి, కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆ తర్వాత సుల్తానాబాద్ మండలం గర్రెపల్లిలో కేంద్రాన్ని పరిశీలించి, ఆయాచోట్ల నిర్వాహకులతో మాట్లాడారు. ఇప్పటివరకు ఎన్ని క్వింటాళ్లు కొన్నారు? అని తెలుసుకున్నారు. వెంట వెంటనే కొనుగోళ్లు చేస్తూ మిల్లులకు తరలించాలని సూచించారు. రైతులతోనూ మాట్లాడారు. కేంద్రాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని అడిగారు. అనంతరం కరీంనగర్ కలెక్టరేట్‌కు చేరుకొని, ఉమ్మడి జిల్లా అధికారులతో సమీక్షించారు. కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపెల్లి జిల్లాల వారీగా ధాన్యం కొనుగోళ్లపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంకెంత ధాన్యం కేంద్రాలకు రావాల్సి ఉన్నది? ఎన్ని కేంద్రాల్లో కొనుగోళ్లు పూర్తయ్యాయి? వంద శాతం ఎప్పటి వరకు పూర్తి చేస్తారు? రైతులకు త్వరగా డబ్బులు అందుతున్నాయా..? ఇంకా ఏమైనా ఇబ్బందులున్నాయా..? అని జిల్లాల వారీగా రివ్యూ చేశారు. కొనుగోళ్లు జరుగుతున్న తీరుపై చర్చించి, మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. వర్షం వల్ల మొలకెత్తిన, తడిసిన ధాన్యంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, అలాంటి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని స్పష్టం చేశారు. ఈ ధాన్యాన్ని బాయిల్డ్ రైస్‌కు ఉపయోగించేలా చూడాలని, ఈ మేరకు రైస్ మిల్లర్లకు ఆదేశాలు ఇవ్వాలని చెప్పారు.

ధాన్యాన్ని వెంటవెంటనే తరలించాలి

- జిల్లా స్పెషల్ ఆఫీసర్ ఆర్వీ కర్ణన్

ధాన్యాన్ని కొనుగోలు చేసిన వెంటనే మిల్లులకు తరలించాలని, ఈ నెలాఖరు వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వందశాతం కొనుగోళ్లు పూర్తి కావాలని అధికారులను ఉమ్మడి జిల్లా స్పెషల్ ఆఫీసర్ ఆర్వీ కర్ణన్ ఆదేశించారు. ఎక్కడా రైతులు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక దృష్టి సారించాలని, తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైతులకు అండగా ఉండాలని సూచించారు. కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలని, సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. సోమవారం సాయంత్రం కరీంనగర్ కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేస్తూ ధాన్యం అమ్మిన రైతులకు సత్వరమే డబ్బులు అందేలా చూడాలన్నారు. గన్నీ బ్యాగుల కొరత లేకుండా అందుబాటులో ఉంచుకోవాలని, అలాగే ప్రభుత్వం నిర్దేశించిన కస్టం మిల్లింగ్ రైస్ డెలివరీ తొందరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈప్రక్రియ దాదాపు వందశాతం పూర్తయ్యేలా అదనపు కలెక్టర్లు ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. ఈ సమావేశంలో కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల అదనపు కలెక్టర్లు లక్ష్మీ కిరణ్, శ్యాంప్రసాద్ లాల్, రాంబాబు, భీమ్యానాయక్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ రజినీకాంత్, మార్కెటింగ్ అధికారి పద్మావతి, డీఆర్డీవో శ్రీధర్, తిమ్మాపూర్ తహసీల్దార్ కనకయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో జిల్లా నేతలకు బాధ్యతలు

కరీంనగర్ కార్పొరేషన్, మే 20: వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కరీంనగర్ జిల్లా బీఆర్ఎస్ నాయకులకు పలు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న జరుగనున్న ఈ ఎన్నికలకు సంబంధించి వరంగల్ వెస్ట్ నియోజకవర్గానికి మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, మాజీ మేయర్ రవీందర్‌సింగ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావుకు బాధ్యతలు అప్పగించారు. వరంగల్ ఈస్ట్ నియోజకవర్గానికి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్‌కు, వర్ధన్నపేట నియోజకవర్గానికి మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, జనగాం నియోజకవర్గానికి బీఆర్ఎస్ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, స్టేషన్ ఘన్‌పూర్‌కు మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, పాలకుర్తికి బీఆర్ఎస్ నాయకుడు చల్మెడ లక్ష్మీనరసింహారావు, నర్సంపేటకు పేరాల రవీందర్‌రావును ఇన్‌చార్జిలుగా నియమించినట్లు వెల్లడించారు.

ఎదిరిద్దాం..కొట్లాడుదాం

- యాసంగి ధాన్యం తరలింపు వ్యవహారంపై జోరుగా చర్చలు
- కాంగ్రెస్ సర్కారు, కాంట్రాక్టర్ల ఒత్తిళ్లకు తలొగ్గితే అసలుకే ఎసరు వస్తుందనే ఉద్దేశం
- గడువు పొడిగించినా డబ్బులు ఇవ్వదని స్పష్టం
- సమష్టిగా ఎదుర్కొందామని మెజార్టీ మిల్లర్ల అభిప్రాయాలు
- ఆ దిశగానే అడుగులు
- అసోసియేషన్లు అండగా నిలుస్తాయా..? లేదా..? అన్నదానిపై ఉత్కంఠ

డబ్బులు ఇవ్వద్దు.. ధాన్యమే ఇచ్చేద్దాం
ఉమ్మడి జిల్లాలోని మెజార్టీ మిల్లర్ల నిర్ణయం

వేలం వేసిన ధాన్యం తరలింపులో కాంగ్రెస్ సర్కారు తీసుకుంటున్న నిర్ణయాలు.. సదరు కాంట్రాక్టర్లు అనుసరిస్తున్న వ్యవహారంపై ప్రస్తుతం రైస్ మిల్లర్లలో జోరుగా చర్చలు నడుస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే కాంట్రాక్టర్లకు ప్రభుత్వంలో కొంత మంది పెద్దలు వంత పాడుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం, కాంట్రాక్టర్ల ఒత్తిళ్లకు తలొగ్గకుండా.. ముందుకెళ్లాలనే అభిప్రాయాలను మెజార్టీ మిల్లర్లు వ్యక్తం చేస్తున్నట్టు తెలుస్తున్నది. ఏమాత్రం తలొగ్గినా అసలుకే ఎసరు వస్తుందన్న ఉద్దేశం కనిపిస్తున్నది. అందు కోసం.. కలిసికట్టుగా ఎదుర్కోవడం తమకు ఒక్కటే మార్గమన్న అభిప్రాయాలు వ్యక్తం కాగా.. అందరూ కలిసి ఆ దిశగా అడుగులు వేస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఇదే సమయంలో కాంట్రాక్టర్లతో అంటకాగుతున్న కొంత మంది మిల్లర్లు మాత్రం తెరవెనుక మంతనాలు నడుపుతున్న తీరు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారుతున్నది.

కరీంనగర్, మే 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : 2022-23 యాసంగి సీజన్‌కు సంబంధించి 35 లక్షల టన్నుల ధాన్యాన్ని రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఫిబ్రవరిలో వేలం వేసింది. ఈ వేలాన్ని నాలుగు కాంట్రాక్టు సంస్థలు దక్కించుకున్నాయి. మిల్లులు, గోదాముల్లో ఉన్న ధాన్యాన్ని తరలించేందుకు ఒక్కో క్వింటాల్‌కు అన్ని ఖర్చులు కలిపి ₹2007 చొప్పున కొనుగోలు చేశాయి. నిబంధనల ప్రకారం టెండర్ లెటర్ ముట్టినప్పటి నుంచి వేలంలో కొన్న ధాన్యాన్ని మూడు నెలల్లో సదరు కాంట్రాక్టర్లు లిఫ్ట్ చేయాలి. కానీ, ఇప్పటివరకు కేవలం 20 శాతం ధాన్యం కూడా లిఫ్ట్ చేయలేదు. తమ వద్ద ఉన్న ధాన్యం తీసుకెళ్లాలని మిల్లర్లు చెబుతున్నా సదరు కాంట్రాక్టర్లు మాత్రం విముఖత చూపుతున్నారు. అంతేకాదు, ధాన్యానికి బదులుగా క్వింటాల్‌కు ₹2,223 ధర కట్టించి ఇవ్వాలనే షరతు పెడుతున్నారు. అంటే ఒక్కో క్వింటాల్‌పై ₹216 అదనంగా వసూలు చేస్తున్నారు. ఈ వ్యవహారాన్ని లోతుగా చూస్తే వందలాది కోట్ల కుంభకోణం ఉన్నట్టు తెలుస్తున్నది. ప్రధానంగా ఈ బాగోతంలో కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దల హస్తం ఉండడంతో కాంట్రాక్టర్లు 'ఆడిందే ఆట.. పాడిందే పాట' అన్నట్టుగా మారిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అడిగిన డబ్బులు ఇవ్వని మిల్లర్లపై బెదిరింపులకు దిగుతున్నారనే ఆరోపణలున్నాయి. భయపడిన పలువురు మిల్లర్లు ఇప్పటికే కాంట్రాక్టర్లు అడిగినట్టు క్వింటాలుకు ₹2,223 చెల్లించారు. అందుకు సంబంధించి చెల్లించిన మొత్తం వివరాలు, ఆ లేఖలను సదరు మిల్లర్లు అసోసియేషన్‌కు అప్పగించారు. అయితే, చెల్లింపు చేసిన మిల్లర్లు లేఖలను చూపిస్తూ.. ఇతర మిల్లర్లపై కూడా సదరు కాంట్రాక్టర్లు ఒత్తిడి తెస్తున్నట్టు తెలుస్తున్నది. ఈ అంశంపై ప్రస్తుతం మిల్లర్లలో పెద్ద చర్చ నడుస్తున్నది.

కథ అడ్డం తిరిగింది

గత ప్రభుత్వం సీఎంఆర్ కింద మిల్లులకు ఇచ్చిన ధాన్యాన్ని పెద్దమొత్తంలో మిల్లర్లు మార్కెట్‌లో అమ్ముకున్నారన్న ఆరోపణలు వచ్చాయి. నిజానికి కొంత మంది మాత్రమే ఈ తరహాలో అడ్డదారి తొక్కినట్టు తెలుస్తున్నది. అయితే, మొత్తం మంది మిల్లర్లు ధాన్యం అమ్ముకున్నారని, టెండర్ దక్కించుకున్న తర్వాత ధాన్యం ఇవ్వాలంటే ఎవరూ ఇవ్వరని, దాంతో మనం చెప్పిందే వేదంగా నడుస్తుందని కొంతమంది మిల్లర్లు ఇచ్చిన సమాచారంతోనే కాంట్రాక్టర్లు వేలంలో పాల్గొన్నట్టు తెలుస్తున్నది. ఈ వ్యవహారంలో ప్రభుత్వ పెద్దల పాత్ర ఉందన్న విమర్శలు కూడా ఉన్నాయి. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు ధాన్యం తీసుకెళ్లడానికి ముందుకు రాగా.. మెజార్టీ మిల్లుల్లో ధాన్యం నిల్వలు ఉన్నాయి. అది చూసి సదరు కాంట్రాక్టర్లు కంగుతిన్నారు. క్షేత్ర స్థాయిలోకి వెళ్లాక.. కథ అడ్డం తిరిగిందన్న విషయాన్ని తెలుసుకొని.. రకరకాల కారణాలు చూపుతూ తమకు కచ్చితంగా.. క్వింటాల్‌కు ₹2,223 చెల్లించాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు. ముందుగా ఎదురు తిరిగిన రెండు మూడు మిల్లులపై పౌరసరఫరా శాఖకు చెందిన విజిలెన్స్ విభాగం ద్వారా దాడులు చేయించారు. ఈ దెబ్బకు భయపడిన కొంత మంది మిల్లర్లు ఇప్పటికే డబ్బులు చెల్లించారు. కానీ, మెజార్టీ మిల్లర్లు మాత్రం ధాన్యం తీసుకెళ్లాలని చెప్పడంతో కాంట్రాక్టర్లు కాలయాపన చేస్తూ వచ్చారు.

ఎదురించాలనే నిర్ణయం

గడువు పొడిగిస్తే సదరు కాంట్రాక్టర్లు తిరిగి పాత పద్ధతే అనుసరించే అవకాశమే అధికంగా కనిపిస్తున్నది. ధాన్యం ఎత్తకుండానే అనుకున్న ప్రకారం క్వింటాల్‌కు ₹2,223 వసూలు చేసే దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేసినట్టు మిల్లర్లలో చర్చ నడుస్తున్నది. అంతేకాదు, అడిగిన మొత్తం ఇవ్వకపోతే వివిధ శాఖల ద్వారా మిల్లులపై దాడులు చేయిస్తారంటూ అంటకాగే కొంత మంది మిల్లర్లు ప్రచారం చేస్తున్నారు. అయితే, మెజార్టీ మిల్లర్లు మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ కాంట్రాక్టర్ల ఒత్తిడికి తలొగ్గొద్దనే అభిప్రాయానికి వచ్చినట్టుగా తెలుస్తున్నది. సమష్టిగా ఎదిరించాలనే నిర్ణయానికి రావడమే కాదు, ఈ విషయాన్ని రైస్‌మిల్లర్ల అసోసియేషన్లతోనూ చర్చించినట్టు తెలుస్తున్నది. మెజార్టీ మిల్లర్ల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని ఎదురొడ్డి పోరాడాలని, అలా కాకుండా ఒక్కసారి తలొగ్గితే అసలుకే ఎసరు వస్తుందని మెజార్టీ మిల్లర్లు వాదిస్తున్నారు. ఒకరిద్దరు మిల్లర్లు చేసిన తప్పులకు.. అందరిపై భారం మోపడం సముచితం కాదన్న వాదనను వారు వినిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో అసోసియేషన్లు కూడా మెజార్టీ మిల్లర్ల అభిప్రాయాల వైపు మొగ్గు చూపడంతోపాటు ఆ దిశగా అడుగులు వేస్తున్నట్టు తెలుస్తున్నది. ఈ పరిస్థితుల్లో.. ప్రభుత్వం ముందుగు ఎటువంటి నిర్ణయాలు తీసుకుంటుందన్న దానిపై చర్చ జరుగుతుండగా.. అసోసియేషన్లు కూడా గట్టిగా పోరాడుతాయా..? లేక ప్రభుత్వం, కాంట్రాక్టర్ల ఒత్తిడికి తలొగ్గి.. మిల్లర్ల ద్వారా అడిగిన మొత్తాన్ని చెల్లింపు చేసేలా చూస్తాయా..? అన్నది ముమ్ముందు తేలనున్నది. దీంతోపాటు రైస్‌మిల్ అసోసియేషన్లు.. వారి వారి ప్రయోజనాలకోసం పాకులాడుతారా..? లేక మిల్లర్ల వైపు నిలిచి పోరాడుతారా..? అన్నదానిపై భిన్న రకాల చర్చలు ప్రస్తుతం మిల్లర్ వర్గాల్లో నడుస్తున్నాయి.

గడువు పొడిగించే చాన్స్!

నిబంధనల ప్రకారం మూడు నెలల గడువు ఈ నెల 23తో ముగుస్తుంది. ఆలోగా ధాన్యం మొత్తం కాంట్రాక్టర్లు లిఫ్ట్ చేయాలి. కానీ, ఉమ్మడి జిల్లా మొత్తం మీద వేలం వేసిన ధాన్యంలో 20 శాతం కూడా ఎత్తలేదు. ఇంకా 80 శాతం ధాన్యం మిల్లులు, గోదాముల్లోనే ఉంది. దీంతో సదరు కాంట్రాక్టర్లు గడువు పొడిగింపు కోసం ప్రభుత్వం వద్ద పైలు కదుపుతున్నట్టు తెలుస్తున్నది. అందులో ప్రభుత్వ పెద్దల హస్తం కూడా ఉందన్న విమర్శల నేపథ్యంలో మరో మూడు నెలల గడువు పొడిగింపు రావచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాదు, మూడు నాలుగు రోజుల్లో అందుకు సంబంధించిన ఉత్తర్వులు కూడా వెలువడుతాయన్న సమాచారం అందుతున్నది.

అన్నదమ్ముల హత్యకేసులో ఏడుగురి అరెస్ట్

- ఇనుప పైపులు, కర్రలు, కారు, రెండు బైక్‌లు, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన జగిత్యాల డీఎస్పీ రఘుచందర్

నిందితులను అరెస్టు చూపుతూ వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

ధర్మపురి, మే 20: బుగ్గారం మండలం గోపాల్‌పూర్‌లో ఈ నెల 16న జరిగిన అన్నదమ్ముల హత్యకేసును పోలీసులు ఛేదించారు. సోమవారం ఏడుగురి నిందితులను అరెస్ట్ చేశారు. వీరివద్ద నుంచి హత్యకు ఉపయోగించిన ఇనుప పైపులు, కర్రలతో పాటు కారు, రెండు బైక్‌లు, ఏడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ సోమవారం ధర్మపురి సర్కిల్ ఆఫీసులో హత్యకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించారు. గోపాల్‌పూర్‌కు చెందిన దీటి తార కొడుకు శ్రీనివాస్ తమ బంధువైన నాగుల అంజయ్య వద్ద 2018లో ఓ ఇంటిని కొనుగోలు చేశాడు. అయితే అదే ఇంటిని 2017లోనే అంజయ్య కొడుకు రాజేశ్ వద్ద నుంచి తాము కొన్నామని తార కొడుకు శ్రీనివాస్‌తో అదే గ్రామానికి చెందిన బుర్ర లక్ష్మి, ఆమె కొడుకులు నాగరాజు, నవీన్ గొడవకు దిగారు. ఈ క్రమంలో లక్ష్మి కోర్టును ఆశ్రయించగా, 2023లో ఈ కేసును కొట్టేసింది. అప్పటి నుంచి రెండు కుటుంబాల మధ్య గొడవలు తీవ్రరూపం దాల్చాయి. అయితే జగిత్యాలలో ఉంటున్న లక్ష్మి, తన కొడుకులు నాగరాజు, నవీన్‌తో కలిసి ఈ నెల 12న ఎల్లమ్మ పండుగ కోసం గోపాల్‌పూర్‌కు వచ్చింది. 16న ఎల్లమ్మ పట్నాలు ముగిసిన తర్వాత నాగరాజు, నవీన్ ఇంటికి వెళ్తున్న సమయంలో తార, శ్రీనివాస్, శ్రీనివాస్‌కు వరుసకు తమ్ముడైన మహేశ్‌తో కలిసి ఇంటి ఎదుట పడుకున్నారు. అప్పటికే కక్ష పెంచుకున్న నవీన్ ఇదే అదనుగా రాకపోకలకు ఇబ్బంది అవుతున్నదని వారితో గొడవకు దిగాడు. చుట్టుపక్కల వారు ఇరువర్గాల వారిని సముదాయించారు. అక్కడి నుంచి వెళ్లిపోయిన నవీన్ మాత్రం శ్రీనివాస్, మహేశ్‌ను హతమార్చాలని నిర్ణయించుకొని, అదేరోజు రాత్రి జగిత్యాలకు చెందిన తన స్నేహితులు జికూరి పవన్, మొగిలిపాల రాజేందర్, బొమ్ముల వెంకటేశ్, నాచుపల్లి గంగరాజం, చింతల శేషు, చొప్పరి అజయ్‌కి ఫోన్‌చేసి గ్రామానికి రప్పించాడు. వీరందరూ హత్యకు పథకం రూపొందించారు. రాత్రి 11.30 గంటలకు తార ఇంటికి వెళ్లి శ్రీనివాస్, మహేశ్‌పై ఇనుప పైపులు, కర్రలతో విచక్షణరహితంగా దాడి చేశారు. ఈ ఘటనలో శ్రీనివాస్ అక్కడిక్కడే చనిపోగా, మహేశ్ వరంగల్ ఎంజీఎంలో కన్నుమూశాడు. దాడి తర్వాత నిందితులు వారు వెంట తెచ్చుకున్న వాహనాల్లో పరారయ్యారు. సోమవారం బుగ్గారం ఎక్స్ రోడ్డు వద్ద సీఐ రాంనర్సింహారెడ్డి నేతృత్వంలో ఎస్ఐలు శ్రీధర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్ వాహనాలు తనిఖీ చేస్తుండగా.. నిందితులు వారి వాహనాల్లో వెళ్తూ పట్టుబడ్డారు. వారిని రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో గొల్లపెల్లి, వెల్గటూర్ ఎస్ఐలు సతీశ్, ఉమాసాగర్ ఉన్నారు.

న్యాయం జరిగే వరకు పోరాటం

- టీపీవీయూ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్

చేనేత జౌళిశాఖ ఏడీకి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

రాజన్న సిరిసిల్ల, మే 20 (నమస్తే తెలంగాణ): నేతన్నల ఉపాధి కోసం గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగించాలని, వారికి న్యాయం జరిగే వరకు పోరాడుతామని తెలంగాణ వపర్‌లూం వర్కర్స్ యూనియన్ టీపీవీయూ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్ పేర్కొన్నారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో టీపీవీయూ నాయకులు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సిరిసిల్ల చేనేత జౌళిశాఖ ఏడీ సాగర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ, టెక్స్‌టైల్స్ పార్కుతో పాటుగా సిరిసిల్ల పవర్‌లూం కార్మికులకు రావాల్సిన పది శాతం యారన్ సబ్సిడీ తగ్గించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. చేనేత జౌళిశాఖ డైరెక్టర్ ఏకపక్ష నిర్ణయాలను ఎట్టి పరిస్థితిలో సహించేదిలేదన్నారు. నేత కార్మికుల ఉపాధి దెబ్బతీసే విధంగా ఆమె వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. మరమగ్గాల పరిశ్రమను సంక్షోభంలోకి నెట్టివేసే విధంగా ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. కార్మికులకు పది శాతం యారన్ సబ్సిడీ తగ్గించకుండా ఇవ్వాలని మాండ్ చేశారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సమస్యలపై వెంటనే సమీక్షా సమావేశం నిర్వహించి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యం చేస్తే ఈ నెల 24న హైదరాబాద్‌లోని చేనేత జౌళిశాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమం లో జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, నాయకులు నక్క దేవదాస్, గుండు రమేశ్, కంది మల్లేశం, బెజుగం సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్
- మృతుడి కుటుంబానికి రూ.2 లక్షల ప్రమాద బీమా చెక్కు అందజేత

చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల, మే 20 : కార్యకర్తలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని 32వ వార్డు భీష్మనగర్‌కి చెందిన మత్స్య కార్మికుడు, బీఆర్ఎస్ కార్యకర్త కొండ్ర విద్యాసాగర్ గత వానకాలంలో చేపల వేటకు వెళ్లి వరదలో చిక్కుకొని మరణించగా పార్టీ సభ్యత్వ ప్రమాద బీమా ద్వారా మంజూరైన ₹2 లక్షల విలువైన చెక్కును మోతె రోడ్డులోని పార్టీ కార్యాలయంలో ఆయన భార్య కొండ్ర జమున, కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో 60 లక్షల పైచిలుకు మంది పార్టీ సభ్యత్వం తీసుకున్నారని, జగిత్యాల నియోజకవర్గంలో 50 వేల మందిపైగా సభ్యత్వం తీసుకున్నట్లు తెలిపారు. బలమైన కార్యకర్తలున్న పార్టీ బీఆర్ఎస్ అని, ప్రమాద బీమా సభ్యత్వం ఉండడం వల్ల వారి కుటుంబానికి ₹2 లక్షలు అందజేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 25 మందికిపైగా ఇన్సూరెన్స్ చెక్కులు అందజేసినట్లు గుర్తు చేశారు. ఒక చురుకైన కార్యకర్తని కోల్పోవడం బాధాకరమని, కొండ్ర జమున, వారి కుటుంబ సభ్యులకు పార్టీ పరంగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. మత్స్య కార్మికుల సంక్షేమం కోసం గతంలో కేసీఆర్ అనేక కార్యక్రమాలు చేపట్టారని, మిషన్ కాకతీయ, ఉచిత చేప పిల్లల పంపిణీ, లైవ్ జాకెట్లు, వ్యాన్‌లు, మోపెడ్‌లు ఇచ్చారని, చెరువులకు హద్దులు గుర్తించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కోరె గంగమల్లు, సంఘం అధ్యక్షుడు శంకర్, మోతె మాజీ సర్పంచ్ జుంబర్తి శంకర్, మాజీ కార్యదర్శి నర్సయ్య, వార్డు యూత్ అధ్యక్షులు బింగి శేఖర్, నాయకులు లింగారెడ్డి, సిరికొండ మహేశ్, రాజేశ్, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఇంటి నుంచి వెళ్లిన ఐదు నిమిషాలకే..

- టిప్పర్ ఢీకొని ఒకరి దుర్మరణం
- తాడికల్‌లో ఘటన
- డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబ సభ్యుల రాస్తారోకో

ఎల్లయ్య (ఫైల్)

శంకరపట్నం, మే 20 : ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఐదు నిమిషాలకే టిప్పర్ ఢీకొని ఒకరు అక్కడికక్కడే మృతిచెందాడు. శంకరపట్నం మండల తాడికల్‌లో సోమవారం ఘటన జరుగగా, డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగిందని కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారిపై రాస